# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ లోక్ సభకు సంబందించి సార్వత్రిక ఎన్నికల మొదటి దశ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ఈరోజుతో ముగిసింది.
- ❖ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలనీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు.
- ❖ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరి కొద్ది సేపటిలో పాల్గొంటారు.
- ❖ రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

====================

లోక్ సభకు సంబందించి సార్వత్రిక ఎన్నికల మొదటి దశ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ఈరోజుతో ముగిసింది. అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన రేపు జరగనుంది. అదే విధంగా మార్చి 30న నామినేషన్లు ఉపసంహరణ ఉండగా, మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19న ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా జరగనున్న లోక్ సభ ఎన్నికలను ఎన్నికలు సంఘం మొత్తం 7 విడతల్లో నిర్వహించనుంది. మొదటి దశలో భాగంగా 21 రాష్ట్రాలలో 102 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

====================

ఎన్నికల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలనీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సీ-విజిల్ యాప్, ఈఎస్ఎంఎస్ ఫిర్యాదులు, ఎంసిసి, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల సన్నద్ధత, తదితర అంశాలపై ఈరోజు ఆయన జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న ఫారం-7, 8ల పరిష్కారం, రాజకీయ పార్టీలకు

అనుమతుల జారిని వేగవంతం చేయడం, సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదును సకాలంలో పరిష్కరించడం, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ పటిష్టంగా అమలుపరచడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. అలాగే నేరుగా గానీ, ఎన్కోర్ పోర్టల్ ద్వారా గానీ అందే ధరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనమతులను మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో ఎంతో అప్రమ్తతంగా ఉండాలని, ఎటు వంటి దుర్ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

====================

ఎన్నికల ప్రచారంలో భాగంగా వై.ఎస్.ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించే  బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరి కొద్ది సేపటిలో పాల్గొని ప్రసంగిస్తారు. ఇదిలా ఉండగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర తొలిరోజు వైస్సార్ జిల్లా కడప పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కొనసాగి, సాయంత్రం వీరపనాయనిపల్లి మండలంలో ముగిసింది. ఈ యాత్రలో భాగంగా ప్రజల వద్ద నుండి పలు వినతి పత్రలను ఆయన స్వీకరించారు.

====================

యువత కోసం 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు చిత్తూరు జిల్లా పుత్తూరులో నిర్వహించిన ప్రజాగళం ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే 60 రోజుల్లో మెగా డీఎస్సీ పూర్తి చేసి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు తీసుకొస్తామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికే బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

====================

వచ్చే నెల 14వ తేదీ లోగా కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈరోజు కలెక్టరేట్ లో సమావేశమైన ఆమె ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఎన్నికలకు సంబంధించిన పలు  అంశాలపై చర్చించారు. కొత్తగా ఓటు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను ఏప్రిల్ 25వ తేదీలోగా పరిశీలించి, అర్హులైన వారికి ఓటుహక్కు కల్పిస్తామని అన్నారు. అలాగే ర్యాలీలు, ప్రదర్శనలు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీకి  అభ్యర్థులు సంబంధిత ఆర్ఓల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

====================

వేసవి తీవ్రత  దృష్ట్యా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కార్యాచరణను ముందుగానే రూపొందించాలని కలెక్టర్ హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లాలో తాగునీటి పరిస్థితిపై ఆయన వివిధ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా  జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో వేస వికాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుండే అప్రమత్తంగా ఉండాలని, అలాగే నీటి ఎద్దడి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

విరామం

====================

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇంటింటా ప్రచారం చేయాలంటే ముందస్తు అనుమతులు తీసుకోవాలని బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఈరోజు కలెక్టరేట్ లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్

మార్గదర్శకాలు తప్పనిసరిగా అనుసరించాల్సి ఉందని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ ప్రచారానికి సంబంధించిన షెడ్యూల్ ను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. జిల్లా స్థాయి నాయకులు జిల్లా వ్యాప్తంగా ప్రచారాలు చేయాల్సి ఉంటే జిల్లా ఎన్నికల అధికారి వద్ద దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. మే నెల 11 తేదీ వరకు మాత్రమే ప్రచారాలకు అనుమతి ఉంటుందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

=====================

రాష్ట్రంలో వేసవి, విద్యార్థుల పరీక్షల సమయం దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ సరఫరా పరిస్థితులపై ఇంధన శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ, వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని తెలియజేశారు.

=====================

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కల్పించవలసిన వసతులు పక్కాగా ఏర్పాటు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలోని ఉద్యాన కళాశాలలో నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఈరోజు ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగే ఎన్నికలు, ఓట్ల లెక్కింపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఇ.వి.యం.ల తరలింపునకు పటిష్ట బందోబస్తు, ఏర్పాటు చేయాలనీ సూచించారు.

=====================

సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపధ్యంలో బ్యాంకులలో 10 లక్షల రూపాయలకు పైబడి జరిగే ప్రతి లావాదేవి వివరాలలను అందించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో బ్యాంకర్లతో ఆయన ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని 24 బ్యాంకుల పరిధిలో 264 బ్రాంచ్ లు ఉన్నాయని, అధికంగా ఆర్థిక లావాదేవీలు చేసిన సమాచారాన్ని బ్యాంకు ఉద్యోగులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే బ్యాంకర్లు నగదు బదిలీకి వాహనాలు మార్చకుండా ఉంటే వాహనాల నెంబర్లు ఇవ్వాలని, వాహనాలను మార్చి పంపినట్లయితే ఆ వివరాలాను రిటర్నింగ్ అధికారి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

=====================

ఎన్నికల ప్రచారానికి సంభందించి ముందస్తు అనుమతి ఖచ్చితంగా తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె. మాధవీలత స్పష్టం చేశారు. కలెక్టరేట్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార సందర్భంలో అనుమతులు కోరుతూ “సువిధా” యాప్ ద్వారా గానీ, నేరుగా గానీ ధరఖాస్తు చేసుకొవాలని పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారం కోసం ఏ రోజు ఏ మార్గంలో ప్రచారం నిర్వహిస్తారో ముందస్తుగా రూట్ మ్యాప్ ఇవ్వాలనీ తెలిపారు. అదే మార్గంలో వేరే పార్టీలు లేదా అభ్యర్థుల ప్రచారం కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే మొదటిగా దరఖాస్తు చేసుకున్న వారికీ ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

=====================

ప్రజలు ఆధ్యాత్మికత, భక్తి భావంతో మెలిగి సన్మార్గంలో నడవాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావు ఆకాంక్షించారు. శ్రీకాకుళంలోని నైపుణ్యాభివృద్ధి భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఆధునిక పోకడలతో పెడదారిన పడుతున్న యువతను సన్మార్గంలో నడిపించాలంటే వారిలో భక్తిభావనలపై చైతన్యం కల్పించాలని

అన్నారు. ఇక్కడ అందించే స్కిల్స్‌ను యువత సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ఈ భవనం ద్వారా మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా మానవసేవ, శాంతి, సత్యం వంటి ధర్మాలవైపు యువత నడవాలని ఆయన ఆకాంక్షించారు.

=====================

=====================